సాక్షి
మెదక్
గురువారం । 13 । జూన్ । 2024

మోగిన బడిగంట

- కళకళలాడిన ప్రభుత్వ పాఠశాలలు
- మొదటి రోజు 70 శాతం హాజరు
- బడిబాటలో 643 అడ్మిషన్లు


బడి గంట కొడుతున్న అటెండర్

మెదక్ కలెక్టరేట్: వేసవి సెలవుల అనంతరం బడి గంట మోగింది. నూతన ఉత్సాహంతో పరుగున వచ్చిన విద్యార్థులతో బుధవారం ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడాయి. జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి పండగ వాతావరణం కల్పించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. మొదటి రోజు 70 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. బడిబాటలో భాగంగా ఇప్పటివరకు 643 మంది పాఠశాలల్లో చేరినట్లు చెప్పారు.


తూప్రాన్: కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు


చిన్నశంకరంపేట: కుమారుడిని పాఠశాలకు తీసుకెళ్తున్న తల్లి


చిలప్‌చెడ్: సోమక్కపేట్‌లో విద్యార్థినులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం: డీఎల్‌పీఓ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సతీశ్

హవేళిఘణాపూర్(మెదక్): సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్‌పీఓ సతీశ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని మల్యాపూర్‌తండా పంచాయతీని సందర్శించారు. అనంతరం గ్రామంలో మురికి కాలువలు, నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించారు. పంచాయతీ రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. గుంతల్లో నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసం ఏర్పడే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి దిగంబర్ ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన డీసీఎం



పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కోళాపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద డీసీఎం డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. బుధవారం హైదరాబాద్ వైపు నుంచి నిజాంపేట వైపు వెళ్తున్న సమయంలో వాహనం అదుపుతప్పింది. 161వ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజాను తొలగించిన నేషనల్ హైవే అధికారులు మధ్యలో డివైడర్లను తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా డివైడర్లను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

స్థానికత ఆధారంగా బదిలీ చేయాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

చేగుంట(తూప్రాన్): 317 జీఓ బాధిత ఉద్యోగులను స్థానికత ఆధారంగా బదిలీ చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. బుధవారం చేగుంటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో 10 వేల మంది ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేసి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. మోడల్ పాఠశాలలతో పాటు గురుకులాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నీరజ, పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజేశ్వర్, సుధాకర్‌రెడ్డి, రమాదేవి, సరస్వతి, రమ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఉచిత కుట్టు శిక్షణ

తూప్రాన్: మున్సిపాలిటీ పరిధిలోని మహిళలకు ఈనెల 24వ తేదీ నుంచి మూడు నెలల పాటు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఖాజామోహియొద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు ఎలాంటి చార్జీలు లేకుండా ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 44 సంవత్సరాలు నిండిన వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'మైనర్లతో పనులు చేయించొద్దు'

చిన్నశంకరంపేట(మెదక్): 18 ఏళ్లలోపు బాల బాలికలతో పనులు చేయిస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తామని జిల్లా కార్మికశాఖ అధికారి సత్యేంద్రప్రసాద్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని మాలాని ఫోం పరిశ్రమలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన బాలకార్మిక చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు రాజు, న్యాయవాదులు కరుణాకర్, సిద్దాగౌడ్, డీసీపీఓ కరుణ శ్రీ పాల్గొన్నారు.

పర్యవేక్షణ ఏదీ?

- 21 మండలాలకు ముగ్గురు ఎంఈఓలు
- ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్న వైనం

రెగ్యులర్ మండల విద్యాధికారి పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో విద్యా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పదో తరగతి ఫలితాల్లో సైతం వెనకబడి పోయారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

– మెదక్ కలెక్టరేట్



కొల్చారం ఎంఈఓ కార్యాలయం

పదేళ్లుగా జిల్లాకు రెగ్యులర్ డీఈఓ, ఎంఈఓ పోస్టులు కరువయ్యాయి. ఆయా మండలాల ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి ఎంఈఓలుగా బాధ్యతలు అప్పగించారు. పదేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల, యూపీఎస్‌ల హెచ్‌ఎంలు ఎంఈఓ పోస్టుల కోసం కోర్టుకెక్కారు. వీరి ఆందోళన సుప్రీంకోర్టుకు చేరడంతో ప్రక్రియ నిలిచిపోయింది. జిల్లాలో 21 మండలాలు ఉండగా కేవలం ముగ్గురు ఇన్‌చార్జి ఎంఈఓలతో 897 పాఠశాలలను నడిపిస్తున్నారు. మరోవైపు 560 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుచ్చానాయక్‌కు నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట, చిలప్‌చెడ్, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, రేగోడ్, చిన్నశంకరంపేట, చేగుంట, తూప్రాన్, మనోహరాబాద్, నార్సింగి మండలాల ఎంఈఓ బాధ్యతలు అప్పగించారు. అలాగే కొల్చారం మండలం పాతశెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నీలకంఠంకు మెదక్, కొల్చారం, పాపన్నపేట, టేక్మాల్, హవేళిఘనాపూర్, రామాయంపేట, నిజాంపేట మండలాల బాధ్యతలు అప్పగించారు. వెల్దుర్తి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అరికెల యాదగిరికి వెల్దుర్తి, మాసాయిపేట మండలాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఉన్న ముగ్గురిలో ఒకరికి 12, మరొకరికి 7, ఇంకొకరికి 2 మండలాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో సతమతం అవుతున్నారు. ఎంఈఓతో పాఠశాలకు సంబంధించి ఏదైన ఫైల్‌పై సంతకం చేయించుకోవాలంటే వారం రోజులు పడుతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల సమయపాలన, విద్యాబోధన, కనీస వసతుల కల్పన, మధ్యాహ్న భోజన పథకం అమలు సక్రమంగా సాగాలంటే ఎంఈఓల పర్యవేక్షణ తప్పనిసరి. రెగ్యులర్ ఎంఈఓలు లేకపోవడంతో మధ్యాహ్న భోజన పథకం అమలు జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బిల్లులు సకాలంలో రావడం లేదని మధ్యాహ్న భోజన నిర్వాహకులు చెబుతున్నారు. మరోవైపు ఎంఈఓలు చేయాల్సిన పనులన్నీ తాము చేయడంతో అధికభారం పడుతుందని, ఫలితంగా బోధనపై దృష్టి పెట్టలేకపోతున్నామని పలువురు హెచ్‌ఎంలు వాపోతున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. అయితే అన్ని మండలాల్లో ఎంఈఓలు లేకపోవడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే బాధ్యత తీసుకొని నడిపిస్తున్నారు. బడిబాట, పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫాంల పంపిణీ ఎంఈఓల పర్యవేక్షణలో కొనసాగాలి. కాని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే బాధ్యత తీసుకుంటున్నారు.

కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు బాధ్యతలు!

ప్రభుత్వం భవిష్యత్‌లో ఎంఈఓ పోస్టులు భర్తీ చేయకుండా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. అదే ఆలోచనతో ఎంఈఓ పోస్టుల భర్తీకి ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై డీఈఓ రాధాకిషన్‌ను వివరణ కోరగా ఎంఈఓల భర్తీ కేసు సుప్రీంకోర్టులో ఉందని.. కోర్టు తీర్పు వచ్చే వరకు ఏం చేయలేని పరిస్థితి ఉందన్నారు. అందుకే ప్రభుత్వం ఇన్‌చార్జిలను నియమిస్తుందని తెలిపారు.

సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య


సంగాయిపేట: విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఈఓ

కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం(నర్సాపూర్): నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం మండలంలోని సంగాయిపేట, ఏటిగడ్డ మాందాపూర్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో డీఈఓ రాధాకిషన్‌తో కలిసి బడిబాటను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జిల్లాలోని 562 పాఠశాలల్లో రూ.20 కోట్లతో అవసరమైన వసతులు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే 92 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత అందించేందుకు విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్ అవకాశం కల్పించామన్నారు. గత పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 17 మంది బాలికలకు 10 జీపీఏ రావడం హర్షణీయమని కొనియాడారు. డీఈఓ రాధాకిషన్ మాట్లాడుతూ.. బడి బయట ఉన్న పిల్లలందరూ బడిలో ఉండే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ నీలకంఠం, తహసీల్దార్ గఫూర్ మియా, ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు, ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ఇర్ఫాన్ హుస్సేన్, ఏపీఓ మహిపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు గ్రామ సమైక్య సంఘాల సభ్యులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

24 మంది విద్యార్థుల ఎంపిక

మెదక్ కలెక్టరేట్: బెస్ట్ అవైలబుల్ పథకం పేద విద్యార్థులకు వరమని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పథకం కింద లాటరీ పద్ధతిన విద్యార్థుల ఎంపిక నిర్వహించారు. 3వ తరగతిలో 13 మంది, 5వ తరగతిలో 6, 8వ తరగతిలో ఆరుగురిని ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలైన గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి, గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం లలితాబాయి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఎంత చెల్లిస్తారు?


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

అధికారులను ప్రశ్నించిన రైతులు

నర్సాపూర్: ట్రిపుల్‌ఆర్‌కు సేకరించే భూములకు పరిహారం ఎంత ఇస్తారో చెప్పకుండా సమావేశాలు ఎందుకు పెడుతున్నారని రైతులు, ఆయా సంఘాల నాయకులు అధికారులను ప్రశ్నించారు. బుధవారం స్థానిక రైతు వేదికలో ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి మండలంలోని నాగులపల్లి, తుజాల్‌పూర్, మహ్మదాబాద్, తిరుమలపూర్, పెద్దచింతకుంట, మూసాపేట, ఖాజీపేట గ్రామాల రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రోడ్డు కోసం సేకరిస్తున్న భూమికి పరిహారం ఎంత ఇస్తారని రైతులు ప్రశ్నించారు. ప్రభుత్వం ఇంకా పరిహారం నిర్ణయించలేదని అధికారులు చెప్పారు. పరిహారం నిర్ణయించకుండా భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకోవడం ఏమిటని నిలదీశారు. రెండు పర్యాయాలు భూములు కోల్పోతున్నామని, తమకు ఎక్కువ పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ.. ట్రిపుల్‌ఆర్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు తగినంత పరిహారం ఇప్పించేందుకు తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్స్‌లు తమకు ఇవ్వాలని, పాన్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని నిరుద్యోగులకు జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖల అధికారి వందన ఒక ప్రకటనలో తెలిపారు. ఎం ఎస్‌పీఎస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఐటీఐ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులకు 72 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి సర్టిఫికెట్లతో సంగారెడ్డిలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం11 వరకు హాజరు కావాలన్నారు. వివరాలకు 08455271010 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలపై సీఎం సానుకూలం

మెదక్‌జోన్: ఉద్యోగుల సమస్యల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, 317 జీఓ ద్వారా నష్టపోయిన వారికి న్యాయం చేకూర్చే విధంగా సబ్ కమిటీ పనిచేస్తుందని సీఎం చెప్పారు. ఆయన వెంట టీఎన్జీఓ నాయకులు ఉన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్

ట్రాన్స్‌కో సిబ్బంది తీరు మార్చుకోవాలి

స్థాయీ సంఘ సమావేశంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ కలెక్టరేట్: ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది తమ తీరు మార్చుకోవాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అధ్యక్షతన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రజలకు విద్యుత్ సేవలు అందించడంలో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో శ్రద్ధ చూపాలని సూచించారు. సమయం, సందర్భం లేకుండా కరెంట్ కోతలు విధించడం సరికాదన్నారు. మిషన్ భగీరథ ద్వారా గతంలో కనెక్షన్ ఇచ్చిన వాటికే ఇప్పటివరకు సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదని, కొత్త వాటి కోసం సర్వే చేపట్టడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. జిల్లాలో చాలా వరకు వైకుంఠధామాలకు నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలన్నారు. మెదక్– కూచన్‌పల్లి రోడ్డు పనుల్లో వేగం పెంచాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. వానాకాలం సీజన్ ప్రారంభమైందని, ట్రాక్టర్ల యజమానులు కేజ్‌వీల్స్‌తో వెళ్లడంతో రోడ్లు పాడవుతున్నాయని చెప్పారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, పంచాయతీ విభాగం, యువజన సంక్షేమం, క్రీడలు, జిల్లా సహకార శాఖ, పరిశ్రమలు, గనులు, రోడ్డు రవాణా, పొల్యూషన్, విద్య, వైద్యం, గ్రంథాలయాలపై చర్చించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిప్యూటీ సీఈఓ రంగాచార్యులు, జెడ్పీటీసీలు మాధవి రాజు, సుజాత శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'అన్ని సదుపాయాలు కల్పిస్తాం'

నారాయణఖేడ్: ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తాం.. విద్యార్థులు బాగా చదువు కోవాలని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కోరారు. నారాయణఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఏకరూప దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం గల ఉపాధ్యాయులు ఉండటంతోపాటు ఉచిత పాఠ్య, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం అందిస్తూ ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.80 వేల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూడు స్కూల్‌ బస్సులు సీజ్‌



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ విజయరావు

పటాన్‌చెరు టౌన్‌: విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో బస్సుల ఫిట్‌నెస్‌ పరిశీలిస్తున్నట్లు పటాన్‌చెరు మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ (ఎంవీఐ) విజయరావు అన్నారు. బుధవారం బీరంగూడ కమాన్‌ సమీపంలో రవాణా శాఖ సిబ్బందితో కలిసి స్కూల్‌ బస్సులను తనిఖీ చేశారు. మొత్తం ఐదు బస్సులను తనిఖీ చేసి ఫిట్‌నెస్‌ లేని మూడు బస్సులను సీజ్‌ చేసినట్లు తెలిపారు. విద్యాసంస్థల బస్సులు తప్పనిసరిగా ఫిట్‌ నెస్‌ చేయించుకోవాలన్నారు.

దర్యాప్తు వేగవంతం

బాలుడి మృతి కేసుకు ఐదు బృందాలు ఏర్పాటు

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు మండలం ముత్తంగి రింగ్‌ రోడ్‌ సమీపంలోనీ కర్దనూర్‌ గ్రామం వైపు వెళ్లే సర్వీస్‌ రోడ్‌లో గుర్తు తెలియని బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి బాలుడి కేసును దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహం లభ్యమైన చోట పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. సోషల్‌ మీడియాలో పోలీసులు వైరల్‌ చేస్తూ బాలుడికి సంబంధించిన వారు ఉంటే సంప్రదించాలని తెలిపారు.

డబుల్‌ బెడ్రూం ఇళ్ల సమస్యపై చర్చ

రెవెన్యూ అధికారులతో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న నర్సారెడ్డి

గజ్వేల్‌: గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న డబుల్‌ బెడ్రూం ఇళ్ల సమస్యపై డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్‌ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి రెవెన్యూ అధికారులతో చర్చించారు. బుధవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్‌ శ్రావణ్‌కుమార్‌తో సమావేశమై ఇళ్ల పంపిణీకి ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీవాసుల సమస్యలపై కూడా చర్చించారు. అంతకుముందు ఐవోసీ మొదటి అంతస్తులో పోస్టాఫీసు ఉండడం వల్ల వృద్ధులకు ఇబ్బంది ఏర్పడుతుందని, దీనిని పాత మండల పరిషత్‌ కార్యాలయంలోకి మార్చే దిశగా కలెక్టర్‌ను కోరతామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుత పోస్టాఫీస్‌ను సందర్శించి ఈ విషయాన్ని అక్కడి అధికారులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ గాడిపల్లి భాస్కర్‌, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

పూలు, చాక్లెట్లతో విద్యార్థులకు స్వాగతం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ప్రారంభించారు. మండలంలోని కల్లెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెడ్‌ కార్పెట్‌ వేసి పూలు చల్లి విద్యార్థులకు చాక్లెట్‌లు ఇస్తూ ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. విద్యార్థుల్లో ఉత్సాహం నింపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్‌ఎం నజీర్‌ తెలిపారు. బెజ్జంకి, గుండారం తదితర పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలలో ముందు మాటలో సీఎంగా కేసీఆర్‌ పేరుతో పాటు మాజీ మంత్రుల పేర్లు ఉండటం పైన కాంగ్రెస్‌ నాయకుడు మానాల రవి మండి పడ్డారు. ఇది అధికారుల నిర్లక్ష్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైనా దాడిలో దూడ మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో దూడ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మాచాపూర్‌ మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కర్రె తిరుపతి రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్ద పశువులను, దూడను పాకలో కట్టేసి ఇంటికొచ్చాడు. ఉదయం వెళ్లే సరికి దూడ తీవ్ర గాయాలతో మృతి చెంది ఉంది. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ బీట్‌ ఆఫీసర్‌ శ్రీకాంత్‌ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. హైనా దాడి చేసినట్లు నిర్ధారించారు. చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



కొడిపల్లి(నర్సాపూర్‌): బెలూన్లు, పుష్పగుచ్ఛంతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలకు హాజరైన విద్యార్థులు



సిద్దిపేటలో మామిడాకులతో విద్యార్థులు



పాఠశాలకు వస్తున్న బాలురు



తరగతి గదిలో చిన్నారులు



పిల్లలతో పాఠశాల సిబ్బంది



పాఠశాలకు వస్తున్న విద్యార్థిని

ఫొటోలు : స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌ సంగారెడ్డి

బడిబాట.. ఉత్తుత్తి మాట



తెరుచుకోని చాంద్‌ఖాన్‌పల్లి పాఠశాల

- చివరి రోజు పాఠశాలలకు తాళాలు
- అధ్యాపకులు రాని వైనం
- డీఈవో విచారణ

నారాయణఖేడ్‌: బడిబాట చివరి రోజు పాఠశాలలో అధ్యాపకులు లేని విషయంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు డీఈవో విచారణ చేపట్టారు. నారాయణఖేడ్‌ మండలంలోని చాంద్‌ఖాన్‌పల్లి, కొండాపూర్‌ స్కూల్‌ తండాలో బడిబాట చివరి రోజైన మంగళవారం అధ్యాపకులు పాఠశాలలకు తాళాలు తీయలేదు. చాంద్‌ఖాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుండగా ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. కొండాపూర్‌ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు ఒక్కరే ఉండగా రాలేదు. నారాయణఖేడ్‌ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలల దుస్థితి ఇది. చివరిరోజు బడిబాట కార్యక్రమాన్ని సైతం నిర్వహించలేదు. దీంతో చాలామంది విద్యార్థులు ప్రైవేట్‌ పాఠశాలల బాట పడుతున్నారు. గ్రామస్తులు, తండావాసులను అడిగితే పాఠశాలలకు సెలవులు ఇచ్చిన నుంచి ఉపాధ్యాయులు రావడం లేదని పేర్కొన్నారు.



తాళం వేసిన ఉన్న కొండాపూర్‌ పాఠశాల

ఎంఈవో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో..

ప్రైవేట్‌ పాఠశాలల అధ్యాపకులు గ్రామాలకు వచ్చి ప్రచారం చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. పాఠశాలలు, బడిబాటను పర్యవేక్షించాల్సిన ఎంఈవో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాఠశాలల దుస్థితి ఈ విధంగా కొనసాగుతుంది. ఎంఈవో విశ్వనాథంను ప్రశ్నిస్తే పాఠశాల వివరాలు తన వద్ద లేవంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఈ పాఠశాలల దుస్థితిపై డీఈవో దృష్టికి తీసుకెళ్లడంతో మెమోలు జారీ చేస్తానని తెలిపారు. బడీడు పిల్లలను బడిలో చేర్పిస్తూ సర్కార్‌ పాఠశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ నిర్వహించేందుకు బడిబాట చేపట్టడం జరిగిందన్నారు. అధ్యాపకులు రాకపోవడం, పాఠశాలకు తాళాలు తెరవకపోడంపై విచారణ చేస్తామన్నారు.

కంగ్రాట్స్‌.. థ్యాంక్స్‌ అన్నా



లారీని జెండాలు ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపీ రఘునందన్‌రావు

- హరీశ్‌రావు, రఘునందన్‌రావుల మధ్య ఆసక్తికర సన్నివేశం
- సిద్దిపేటలో ఓ కార్యక్రమానికి ఇద్దరు హాజరు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): పార్లమెంట్‌ ఎన్నికల ఓటింగ్‌ పూర్తయ్యే వరకు ఉప్పు, నిప్పుల ఉన్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావుల పలకరింపుతో అక్కడే ఉన్న ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా గమనించారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం అమర్‌నాథ్‌ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో సరుకులతో కూడిన లారీని బుధవారం శ్రీ శరభేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమర్‌నాథ్‌కు పంపించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు హాజరయ్యారు. ముందుగా ఎంపీ రఘునందన్‌రావు హాజరై శివపార్వతుల కళ్యాణానికి వీక్షిస్తుండగా ఎమ్మెల్యే హరీశ్‌రావు వచ్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు రఘునందన్‌రావుకు కంగ్రాట్యులేషన్స్‌ చెప్పడంతో రఘునందన్‌రావు ప్రతిగా థ్యాంక్స్‌ అన్న అన్నారు. దీంతో అక్కడ ఉన్న ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు, భక్తులు ఇద్దరిని ఆసక్తిగా గమనించారు. శివపార్వతుల కళ్యాణం అనంతరం జెండాను ఊపి సరుకుల వాహనాన్ని ప్రారంభించారు. అంతకు ముందు అమర్‌నాథ్‌ అన్నదాన సేవా సమితి సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

సిద్దిపేట ఓటర్ల పాత్ర కీలకం

మెదక్‌ ఎంపీగా గెలుపులో సిద్దిపేట నియోజకవర్గ ఓటర్ల ప్రాత కీలకంగా మారిందని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మెదక్‌ ఎంపీగా విజయం సాధించిన తరువాత తొలిసారిగా బుధవారం సిద్దిపేటకు వచ్చారు. జిల్లా కేంద్రంలో శ్రీ శరభేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయంలో నా కంటే అధికంగా కష్టపడిన బూత్‌ కమిటీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తా..

మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావు



ఎంపీ రఘునందన్‌ రావును సన్మానిస్తున్న గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పార్లమెంట్‌ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తానని మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావు అన్నారు. మంగళవారం రాత్రి తెల్లాపూర్‌లో గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీవాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పోలింగ్‌ కేంద్రాల్లో తనకు మంచి మెజార్టీ వచ్చిందని, ఈ మెజార్టీని ఇచ్చిన తెల్లాపూర్‌ మున్సిపల్‌ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్‌నగర్‌ నుంచి తెల్లాపూర్‌ వెళ్లే మార్గంలోని రైల్వే అండర్‌ బ్రిడ్జిను అభివృద్ధి చేస్తానన్నారు. తెల్లాపూర్‌ రైల్వే స్టేషన్‌లో ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి ఏర్పాటుతోపాటు తెల్లాపూర్‌ వరకు ఎంఎంటీఎస్‌ రైలు సర్వీస్‌లను పెంచే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న రేడియల్‌ రోడ్డు, తెల్లాపూర్‌లో పోస్ట్‌ ఆఫీస్‌ ఏర్పాటు వంటి పనులు చేస్తానన్నారు. భారీ మెజార్టీతో గెలిపించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ శంషాబాద్‌ రాజు, కిసాన్‌ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌ రెడ్డి, తెల్లాపూర్‌ నైబర్‌హుడ్‌ ప్రతినిధులు ఈశ్వరగారి రమణ, శరత్‌, సుధాకర్‌, వెంకట్‌ రెడ్డి, రాజు, ప్రదీప్‌ రెడ్డి, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి..

యువతి అదృశ్యం



మనూష (ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కుర్షిద్‌ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామానికి చెందిన మనూష (24) ఇస్నాపూర్‌ లో ప్రైవేట్‌ జాబ్‌ చేస్తుంది. ఈ నెల 10వ తేదీన ఉదయం ఇంటి నుంచి ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా మనూష ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్‌ చేస్తే స్విచ్ఛాఫ్‌ వచ్చింది. కూతురి అదృశ్యంపై తండ్రి పాపయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్‌: తల్లి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు చేశాడు. అమీన్‌పూర్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం.. ప్రకాశం జిల్లాకు చెందిన రాజు తన తల్లి సుబ్బులుతో కలిసి బీరంగూడ లింగమయ్య కాలనీలో ఉంటూ మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం రాజు మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి మందలించింది. దీంతో రాజు ఇంటి నుంచి వెళ్లిన కొద్దిసేపటికి రాజుకు అతని మామ ఏడుకొండలు ఫోన్‌ చేసి సుబ్బులు నీకోసం వెతుక్కుంటూ వచ్చిందని తెలిపాడు. దీంతో తల్లి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి అదృశ్యంపై రాజు బుధవారం పోలీసులకు చేశాడు.

కారు, లారీ ఢీ

ఇద్దరికి తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

నర్సాపూర్‌: కారు, లారీ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి, ఈ ఘటన నర్సాపూర్‌ మెయిన్‌ రోడ్డు చౌరస్తాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ పుష్పరాజ్‌ కథనం మేరకు.. హైదరాబాద్‌లోని దుండిగల్‌కు చెందిన మహేశ్‌, యూసూఫ్‌గూడకు చెందిన అక్షయ్‌, మాదాపూర్‌కు చెందిన మరో ముగ్గురు కారులో ఏడుపాయలకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో నర్సాపూర్‌ మెయిన్‌ రోడ్డు చౌరస్తాకు రాగానే సంగారెడ్డి వైపు నుంచి వస్తున్న లారీ వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేశ్‌, అక్షయ్‌కు తీవ్ర గాయాలు మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. అదే సమయంలో చౌరస్తా వద్ద పెట్రోలింగ్‌ చేస్తున్న పోలీసులు క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

మద్దూరు(హుస్నాబాద్‌): ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన దూల్మిట్ట మండలంలోని బెక్కల్‌ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ జగదీశ్వర్‌ కథనం మేరకు.. యాద్రాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు చెందిన మంజీరి నరేశ్‌ బైక్‌పై అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి వెళ్లి బీబీనగర్‌ తిరిగి వెళ్తున్నాడు.బెక్కల్‌ గుట్ట సమీపంలో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నరేశ్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేశ్‌కు తీవ్ర గాయాలు కాగా వెంటనే సిద్దిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నరేశ్‌ భార్య అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

శాస్త్రవేత్త విజయ్‌కుమార్‌



రైతులతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌

జహీరాబాద్‌ టౌన్‌: యాజమాన్య పద్ధతులు పాటిస్తే చెరకు పంటలో అధిక దిగుబడి సాధించొచ్చని న్యాల్‌కల్‌ మండలంలోని బసంత్‌పూర్‌ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్‌ విజయ్‌కుమార్‌ సూచించారు. మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్‌ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న చెరకు తోటలను ఆయన వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతితో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పంట సాగుతో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం చెరకులో పొక్కబోయిన తెగుళ్ల ఆశిస్తున్నాయని, ఫలితంగా ఆకులు ముడతలు పడి పంట ఎదుగుదల ఆగిపోయిందన్నారు. నివారణకు సాఫ్‌ 3 గ్రాములు లీటర్‌ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. జొన్న మల్లె కూడా పంటను దెబ్బతీస్తుందన్నారు. జొన్న మల్లె కలుపు మొక్క నివారణకు 2,4డీ నాక్‌ వీడ్‌ను 5 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట మొదళ్లలో మట్టిని ఎగదోయాలన్నారు. ఆయన వెంట ఏడీఏ భిక్షపతి, ఏఈ వినోద్‌కుమార్‌, ఏఈ ప్రవీణ్‌, ఆత్మబీటీఎం చరణ్‌, పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 41 గొర్రెలు మృతి



మృత్యువాత పడ్డ గొర్రెలు

రామాయంపేట(మెదక్‌): పిడుగుపాటుకు గొర్రెలు మృతి చెందిన ఘటన రామాయంపేట పట్టణ శివారులోని వెంకన్నగారి చెరువు సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గొర్రెల కాపరులు చెట్టు కింద ఆశ్రయం పొందారు. ఒక్కసారిగా పిడుగుపడటంతో 41 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గాయంతి కనకరాజుకు చెందిన 13 గొర్రెలు, మహేశ్‌కు చెందిన 14, మల్లయ్యకు చెందిన 14 మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకొని స్థానిక తహసీల్దార్‌ రజనీ కుమారి ఘటనా స్థలిని సందర్శించారు. మున్సిపల్‌ కౌన్సిలర్‌ దేమో యాదగిరి, బీజేపీ పట్టణాధ్యక్షుడు శంకర్‌గౌడ్‌ బాధితులను పరామర్శించారు.

పాడి గేదె..

కొమురవెల్లి(సిద్దిపేట): పిడుగుపాటుకు పాడి గేదె మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన రైతు పుట్ట రాజు పాడి గేదెలను వ్యవసాయ బావి వద్ద చెట్టుకు కట్టేశాడు. బుధవారం సాయంత్రం పిడుగుపడి గేదె మృతి చెందింది. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు.

అందోల్‌లో మహిళా రైతు

వట్‌పల్లి(అందోల్‌): పిడుగుపాటుకు మహిళా రైతు మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా అందోలు మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన అందోలు అంజమ్మ(55) బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి సొంత పొలంలో పత్తి విత్తనాలు వేయడానికి వెళ్లింది. సాయంత్రం సమయంలో పెద్ద ఎత్తున ఉరుములతో కూడిన వర్షం కురుస్తుండగా నలుగురు చెట్టు కిందికి వెళ్లారు. అప్పుడే ఒక్కసారిగా పిడుగుపడటంతో అంజమ్మతోపాటు ఆమె కొడుకు సాయిలు, కోడలు పూజిత, అల్లుడు సామ్యుసిల్లి పడిపోయారు. కొద్దిసేపటి తర్వాత అంజమ్మ మినహా మిగితా వారంతా తేరుకున్నారు. వెంటనే ఆమెను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- విద్యుత్‌ శాఖ అధికారులే కారణమంటూ గ్రామస్తుల ఆందోళన
- మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్‌
- ఎమ్మెల్యే రోహిత్‌ హామీతో విరమణ



నగేశ్‌(ఫైల్‌)

హవేళిఘణాపూర్‌(మెదక్‌): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మెదక్‌ మండలం పేరూర్‌ గ్రామంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెల్మకన్నె నగేశ్‌(48) ఉదయం పొలం వద్దకు వెళ్లి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో కాలుజారడంతో విద్యుత్‌ స్తంభానికి బిగించిన సపోర్టు వైరును పట్టుకున్నాడు. వైరు కరెంట్‌ షాక్‌ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అప్పటికే మృతి చెందాడు. అధికారులు ఎన్నో రోజులుగా సపోర్టు వైరుకు ఉన్న పూస విరిగిపోయినా నిర్లక్ష్యంగా ఉంచడం వల్లే అమాయక రైతు ప్రాణాలు పోయాయని, వారి కుటుంబాన్ని ఆదుకునేదెవరంటూ విద్యుత్‌ శాఖ ఏఈ, ఏడీఏలను రైతుల నిలదీశారు. రైతు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ మృతదేహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి మెదక్‌– బొడ్మట్‌పల్లి రహదారిపై మృతుడి కుటుంబ సభ్యులు, రైతులు ధర్నా చేశారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్‌ రూరల్‌ సీఐ కేశవ్‌ ఘటనా స్థలానికి చేరుకొని ఒప్పించే ప్రయత్నం చేసినా వినలేదు.

ఎమ్మెల్యే చొరవతో ఆందోళన విరమణ

దాదాపు మూడు గంటల పాటు జరిగిన ధర్నా విషయాన్ని మెదక్‌ కాంగ్రెస్‌ నాయకులు శ్రీనివాస్‌ చౌదరి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్‌ షాక్‌కు గురైన రైతు నగేశ్‌ మృతి చెందడం బాధాకరమని, తనవంతుగా రూ.2 లక్షలు అందజేస్తానని, ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల బెనిఫిట్స్‌ను ఇప్పించడంతో పాటు ప్రస్తుతం విద్యుత్‌ శాఖ తరపున రూ.లక్ష అందజేస్తామని హామీనివ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. మృతుడికి భార్య విజయ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ధర్నా చేస్తున్న గ్రామస్తులు, మృతుడి కుటుంబీకులు

ప్రైవేట్‌ ఎలక్ట్రీషియన్‌..



ట్రాన్స్‌ ఫార్మర్‌ వద్ద ఆంజనేయులు మృతదేహం

వెల్దుర్తి(తూప్రాన్‌): విద్యుదాఘాతంతో ప్రైవేట్‌ ఎలక్ట్రీషియన్‌ మృతి చెందిన ఘటన మండలంలోని రామాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్‌ఐ నవతగౌడ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన కాలేరు ఆంజనేయులు(45) ప్రైవేట్‌ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఓ రైతు పొలం వద్ద బుధవారం బోర్‌ మోటార్‌ రిపేర్‌ చేయడానికి వెళ్లాడు. విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద పని చేస్తున్న క్రమంలో కరెంట్‌ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్‌ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

40 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టివేత



రేషన్‌ బియ్యంతో పోలీసులు

సిద్దిపేటకమాన్‌: ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్‌, టూటౌన్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్‌ సీఐ ఉపేందర్‌ కథనం మేరకు.. పట్టణానికి చెందిన మూడ శ్రీనివాస్‌ శంకర్‌నగర్‌లోని తన షాపులో అక్రమంగా రేషన్‌ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌, టూటౌన్‌ పోలీసులు వెళ్లి తనిఖీ చేశారు. షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.